క్లుప్తంగా

ఎమ్మెల్యేకు ఆహ్వానం



ఎమ్మెల్యేకు పత్రిక అందజేస్తున్న సర్పంచ్, స్పోర్ట్స్ క్లబ్ నిర్వాహకులు

మద్దూరు(హుస్నాబాద్): దూల్మిట్ట స్పోర్ట్స్ క్లబ్ రెండో వార్షికోత్సవానికి జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డిని గురువారం గ్రామ సర్పంచ్ దుబ్బుడు దీపికవేణుగోపాల్‌రెడ్డి, స్పోర్ట్స్ క్లబ్ నిర్వాహకులు కలిసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ నెల 12 నుంచి 14 వరకు క్రీడలు జరగనున్నాయన్నారు. ఉమ్మడి వరంగల్, కరీంనగర్, మెదక్ జిల్లా కబడ్డీ, వాలీబాల్ క్రీడాకారులు 11వ తేదీన పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. అలాగే క్రీడాకారులకు ప్రథమ బహుమతి రూ.25వేలు, ద్వితీయ బహుమతి 15వేలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ పోతురాజు మధు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో పోటీతత్వం పెరగాలి



విద్యార్థులకు డిక్షనరీలు అందజేస్తున్న బీజేపీ నాయకులు

నంగునూరు(సిద్దిపేట): విద్యార్థుల్లో పోటీతత్వం ఉంటేనే ప్రతిభ వెలుగులోకి వస్తుందని బీజేపీ మహిళా మోర్చా నాయకురాలు, కౌన్సిలర్ కొత్తపల్లి రాధ అన్నారు. నర్మేట కస్తూర్బా గాంధీ పాఠశాలలో గురువారం బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించి విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా రాధ మాట్లాడుతూ.. పదో తరగతి చదువుతున్న విద్యార్థులు మంచి మార్కులు సాధిస్తే వారికి సమానంగా ప్రోత్సాహకాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షురాలు జ్యోతిరెడ్డి, వేణుగోపాల్, వాసర యాదమల్లు, స్పెషల్ ఆఫీసర్ పద్మ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలు మానసికోల్లాసానికి దోహదం



పోటీలను ప్రారంభిస్తున్న సంతోష్‌కుమార్

మద్దూరు(హుస్నాబాద్): క్రీడలు మానసికోల్లాసంతో పాటు స్నేహ భావాన్ని పెంపొందిస్తాయని మద్దూరు మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు మేక సంతోష్‌కుమార్ అన్నారు. గురువారం గాగ్గిళ్లాపూర్‌లో నిర్వహించిన క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత చెడు మార్గంలో నడవకుండా చదువుతో పాటు క్రీడలపై ఎక్కువ ఆసక్తి కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బొల్లు కృష్ణవేణిచంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం



సన్మానిస్తున్న క్రైస్తవ మతపెద్దలు

కోహెడ(హుస్నాబాద్): నూతన సంవత్సరం పురస్కరించుకొని మండలంలోని పలువురు క్రైస్తవ మతపెద్దలు ఎమ్మెల్యే సతీశ్‌కుమార్‌కు శుభాకాంక్షలు తెలిపారు. హన్మకొండలోని ఆయన స్వగృహంలో ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి సన్మానించినట్లు క్రైస్తవ ప్రతినిధులు తెలిపారు

వాటర్ ట్యాంక్ పనులు ప్రారంభం

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మండలం పోతారం(ఎస్) గ్రామ శివారు పల్లె ఒడ్డెర కాలనీలో మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్ నిర్మాణానికి గురువారం సర్పంచ్ బత్తిని సాయిలు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. పనులు వేగవంతం చేసి వేసవిలో కాలనీ ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బొమ్మగాని శ్రీనివాస్, ఉపసర్పంచ్ శ్రీనివాస్, ఏఈ మమత, కార్యదర్శి ఎల్లయ్య ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా నుంచి నర్సాపూర్ చౌరస్తా వరకు విద్యుత్ నూతన పోల్‌ల మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పటేల్‌పుర, అంబేడ్కర్‌నగర్, సంజీవయ్యనగర్, సాజీద్‌పుర, పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సిద్దిపేట పట్టణ అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ (ఆపరేషన్) పండరీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని ఆయన కోరారు.

‘డబుల్’ జాబితాపై గందరగోళం

- ఉన్నవారికే ఇళ్ల కేటాయింపు
- అభ్యంతరాలను స్వీకరించిన అధికారులు
- కొత్తగా 534 దరఖాస్తులు
- మళ్లీ మొదటికి వచ్చిన సర్వే



హుస్నాబాద్‌లో పంపిణీకి సిద్ధంగా ఉన్న డబుల్ బెడ్రూం ఇళ్లు

హుస్నాబాద్: డబుల్ బెడ్రూం ఇళ్ల సర్వేలో అధికారులు విడుదల చేసిన లబ్ధిదారుల అర్హత జాబితాపై గందరగోళం నెలకొంది. ఇళ్లు ఉన్నవారికే ఇళ్ల కేటాయింపులు, ఒకే ఇంటిలో ఇద్దరి వ్యక్తులకు జాబితాలో పేర్లు పొందుపర్చారంటూ అధికారుల సర్వే తీరుపై సర్వత్రా విమర్శలు గుప్పిస్తున్నారు.

- హుస్నాబాద్ పట్టణంలో 168 డబుల్ బెడ్రూం ఇళ్ల కోసం 1426 దరఖాస్తులు వచ్చాయి. పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేయాలని స్థానిక ప్రజాప్రతినిధుల జోక్యం లేకుండానే జిల్లా అధికారులు ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహించారు.
- 1426 దరఖాస్తుదారులకు గాను 489 మంది డబుల్ బెడ్రూం ఇళ్ల ఎంపికకు అర్హత సాధించినట్లు అధికారులు జాబితాను విడుదల చేశారు. దీనిపై డిసెంబర్ 27 నుంచి 29 వరకు అభ్యంతరాలను స్వీకరించారు.
- అధికారులు విడుదల చేసిన జాబితా అంతా తప్పుల తడకగ ఉందని లబ్ధిదారులు ఆందోళనకు దిగారు.
- అభ్యంతరాల అనంతరం ఇళ్లు ఉన్నవారికే ఇళ్లు కేటాయించారని, అనర్హులను తొలగించాలని 83 ఫిర్యాదులు అందాయి. అలాగే సర్వే సరిగా చేయలేదని మళ్లీ సర్వే చేసి అర్హులైన లబ్ధిదారులకు ఇళ్లు కేటాయించాలని కొత్తగా మరో 534 దరఖాస్తులు వచ్చాయి.

అదృష్టం ఎవరిని వరిస్తుందో..

- డబుల్ బెడ్రూం ఇళ్ల విషయంలో ఎలాంటి పైరవీలకు తావులేకుండా స్థానిక ప్రజాప్రతినిధులు, మున్సిపల్, రెవెన్యూ అధికారుల ప్రమేయం లేకుండా పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక జరగాలని జిల్లా కలెక్టర్ జిల్లా స్థాయి అధికారులను నియమించారు.
- సర్వేలో జిల్లా అధికారులు పాల్గొనకుండా స్థానిక అధికారులతో సర్వే నిర్వహించారంటూ లబ్ధిదారులు, ఇతర పార్టీల నాయకులు ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు.
- ఏ ప్రమాణికాన్ని తీసుకొని లబ్ధిదారులను ఎంపిక చేయాలనే మార్గదర్శకాలు విడుదల చేయకపోవటంతో ఇళ్ల ఎంపిక ప్రక్రియ గందరగోళంగా మారింది.
- కిందిస్థాయి అధికారులు సరైన వివరాలు తెలుసుకోకుండా ఇష్టం వచ్చినట్లు సర్వే చేశారనే అపవాదును ఎదుర్కొంటున్నారు.
- ఒక వార్డులో 90 మంది, మరో వార్డులో 70 మంది, ఇంకో వార్డులో ఐదుగురిని ఇలా ఇష్టం వచ్చినట్లు ఎంపిక చేశారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.
- లక్కీ డ్రాలో ఒకటి, రెండు వార్డుల లబ్ధిదారులకే అదృష్టం వరిస్తే, మిగితా వార్డుల లబ్ధిదారుల సంగతేమిటనే ప్రశ్న తలెత్తుతుంది. ప్రతీ వార్డుకు కొన్ని ఇళ్లు కేటాయించి డ్రా ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేసినట్లయితే అన్ని వార్డులకు న్యాయం చేసినట్లవుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.
- మరోవైపు అదనంగా మరో 534 కొత్తగా దరఖాస్తులు పెట్టుకోవడంతో ఎవరెవరికి ఇళ్లు వస్తాయోనని లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.
- కొత్తగా వచ్చిన దరఖాస్తులను పరిగణంలోకి తీసుకుంటారా, అర్హత సాధించిన జాబితాలో అనర్హులను తొలగించి ఉన్నవారికే కేటాయిస్తారా, మొత్తం దరఖాస్తులకు రీ సర్వే చేస్తారా అనేది స్పష్టం కావాల్సి ఉంది.



ఫిర్యాదులను వార్డుల వారీగా విభజిస్తున్న మున్సిపల్ అధికారులు

కలెక్టర్ నిర్ణయం ప్రకారం



డబుల్ బెడ్రూం ఇళ్లకు సంబంధించి అభ్యంతరాలు, రీ సర్వే చేయాలని కొందరు కొత్తగా దరఖాస్తులు పెట్టుకున్నారు. వార్డు వారీగా వచ్చిన ఫిర్యాదుల జాబితాను తయారు చేశాం. వీటిని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తాం. కలెక్టర్ తీసుకున్న నిర్ణయం ప్రకారం నడుచుకుంటాం. మరో నాలుగు రోజుల్లో స్పష్టత వచ్చే అవకాశం ఉంది. కలెక్టర్ సూచించిన విధంగానే లబ్ధిదారులు ఎంపిక ఉంటుంది.

–రాజమల్లయ్య, మున్సిపల్ కమిషనర్, హుస్నాబాద్

రైతు పక్షపాతి సీఎం కేసీఆర్



గంగాపూర్‌లో మిర్చి మార్కెట్ ప్రారంభిస్తున్న దృశ్యం

చిన్నకోడూరు(సిద్దిపేట): సీఎం కేసీఆర్ రైతు సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేస్తున్నారని జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ కొండం వనితలు అన్నారు. గురువారం మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో మండల పరిధిలోని గంగాపూర్‌లో మిర్చి మార్కెట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వ్యవసాయానికి నిరంతర ఉచిత విద్యుత్, రైతుబంధు, రైతుబీమా, పంటలకు గిట్టుబాటు ధరతో కొనుగోలు చేస్తూ ఆదుకుంటోందన్నారు. రైతులు వరితో పాటు కూరగాయలు, ఆయిల్‌పామ్ సాగు చేయాలని సూచించారు. తక్కువ పెట్టుబడితో మంచి ఆదాయం వస్తుందన్నారు. ఆయిల్ పామ్ సాగుకు ప్రభుత్వం సబ్సిడీలు అందిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కనకరాజు, సర్పంచ్ లింగారెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కామిని శ్రీనివాస్, మార్కెట్ కమిటీ కార్యదర్శి పరమేశ్వర్, ఏఎంసీ డైరెక్టర్లు వెంకట్‌రెడ్డి, లింగం, మల్లేశం, శేఖర్, రాములుతో పాటు ఆయా గ్రామాల సర్పంచ్‌లు, రైతులు పాల్గొన్నారు.

టీపీటీఎఫ్ కేలండర్ ఆవిష్కరణ



గజ్వేల్‌లో కేలండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి



కేలండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ముత్తిరెడ్డి, తదితరులు



దుబ్బాకటౌన్: కేలండర్ ఆవిష్కరిస్తున్న ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి

చేర్యాల(సిద్దిపేట): టీపీటీఎఫ్ 2023 సంవత్సర కేలండర్‌ని గురువారం పట్టణ కేంద్రంలోని పెద్దమ్మగడ్డ బాలుర పాఠశాలలో ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపరాణి, ఎంపీపీ ఉల్లంపల్లి కరుణాకర్, వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌కుమార్‌రెడ్డిలతో కలిసి ఆవిష్కరించారు. టీపీటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు నిమ్మ బాపురెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు కొమండ్ల రాంరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి నరేశ్, టీపీటీఎఫ్ ప్రతినిధులు కొండల్‌రెడ్డి, రాజమల్లయ్య, చంద్రారెడ్డి, గోవిందరాజు, రత్నాకర్, బాపు, రాములు, నాయకులు బాల్‌నర్సయ్య, అంజయ్య పాల్గొన్నారు.

విద్యారంగాభివృద్ధికి ప్రభుత్వం కృషి

గజ్వేల్: విద్యారంగాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ(టీఎస్‌ఎఫ్‌డీసీ) చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డిలు అన్నారు. గురువారం గజ్వేల్‌లోని మహతీ ఆడిటోరియం ఆవరణలో టీపీటీఎఫ్ కేలండర్‌ను వారు ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున్, రాష్ట్ర కౌన్సిలర్ రాజు, గజ్వేల్ జోన్ కన్వీనర్ సుంచు నరేందర్, కో–కన్వీనర్ విద్యాసాగర్, జోన్ పరిధిలోని ఆయా మండలాల బాధ్యులు పాపిరెడ్డి, పర్వతం నర్సయ్య, శేషాచారి, విద్యాధర్‌రెడ్డి, శంకర్, నాగరాజు, రాములు, యూసుఫ్, సీనియర్ నాయకులు పి.ఎల్లయ్య, ధమ్మని మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

కొండపాక(గజ్వేల్): మండలంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో టీపీటీఎఫ్ నూతన కేలండర్‌ను గురువారం ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు విజయేందర్‌రెడ్డి, కార్యదర్శి సత్యకృష్ణ, నాయకులు రామస్వామి, కనకయ్య, పద్మారెడ్డి, రాంచంద్రం, నాగరాజు, భైరయ్య, గోపాల్‌రెడ్డి, లక్ష్మి, శంకర్, శ్రీనివాస్, తిరుపతి, వెంకటయ్య, యాదగిరి, లక్ష్మారెడ్డి, సునీత, కళాకిరణ్, నాగరాణి, లావణ్య, మాధవి, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

దుబ్బాకటౌన్: టీపీటీఎఫ్ నూతన సంవత్సరం కేలండర్‌ను గురువారం ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తిరుపతిరెడ్డి, ఉపాధ్యాయులు, బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.

‘తప్పుడు ఆరోపణలు చేస్తే సహించం’

చిన్నకోడూరు(సిద్దిపేట): మంత్రి హరీశ్‌రావు, చిన్నకోడూరు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ కొండం వనితపై తప్పుడు ఆరోపణలు చేస్తే చూస్తూ ఊరుకోమని మండల పరిధిలోని చర్లఅంకిరెడ్డిపల్లి గ్రామస్తులు మండిపడ్డారు. గురువారం గ్రామ సర్పంచ్ స్వర్ణలతశ్రీనివాస్, మాజీ సర్పంచ్ లక్ష్మణ్‌తో పాటు గ్రామస్తులు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మంత్రి హరీశ్‌రావు కృషితోనే గ్రామంలో ఎంతో అభివృద్ధి జరిగిందన్నారు. మంత్రిని విమర్శిస్తే సహించేది లేదన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ భర్త అక్రమాలకు, అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించడం సరికాదని, ఆధారాలతో బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. మంత్రిపై తప్పుడు ఆరోపణలు చేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. ఇప్పటికైనా ఆరోపణలు మానుకొని గ్రామాభివృద్ధికి కలిసిరావాలని హితవు పలికారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ భర్త రవీందర్‌రెడ్డి, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పెండింగ్ బకాయిలు విడుదల చేయాలి

ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కోశాధికారి ప్రేమ్‌కుమార్



మాట్లాడుతున్న ప్రేమ్‌కుమార్

చేర్యాల(సిద్దిపేట): పెండింగ్ స్కాలర్‌షిప్, ఫీజు రియింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కోశాధికారి బంగారు ప్రేమ్‌కుమార్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి బడ్జెట్‌లో అత్యధిక నిధులు కేటాయిస్తున్నామని చెబుతుందే తప్పా విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజు రియింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను మాత్రం చెల్లించడం లేదన్నారు. దీంతో డిగ్రీ, ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులకు ఆయా కళాశాలల యాజమాన్యాలు ఫీజు డబ్బులు పూర్తిగా చెల్లిస్తేనే సర్టిఫికెట్లు ఇస్తామని అనేక ఇబ్బందులకు గురిచేస్తున్నాయన్నారు. ఇప్పటికైనా విద్యారంగంపై ప్రభుత్వ వైఖరి మార్చుకొని వెంటనే పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని కోరారు. లేని పక్షంలో ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో విద్యార్థి నాయకులు సుకన్య, కల్యాణి, శిరీష, కావ్య, మౌనిక, దివ్య, పద్మ పాల్గొన్నారు.

జెడ్పీటీసీ మల్లేశంకు నివాళి



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ముత్తిరెడ్డి

చేర్యాల(సిద్దిపేట): ఇటీవల హత్యకు గురైన చేర్యాల జెడ్పీటీసీ సభ్యుడు శెట్టె మల్లేశం దశదినకర్మ ఆయన స్వగ్రామమైన గుర్జకుంటలో గురువారం జరిగింది. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి హాజరై మల్లేశం చిత్రపటం వద్ద నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఆయన వెంట ఎంపీపీ కరుణాకర్, కొమురవెల్లి జెడ్పీటీసీ సిద్ధప్ప, మున్సిపల్ వైస్ చైర్మన్ రాజీవ్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ మల్లేశం, రాష్ట్ర నాయకుడు బాల్‌నర్సయ్య, మండల అధ్యక్షుడు మల్లేశం, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు

అతిథి అధ్యాపకులకు దరఖాస్తుల ఆహ్వానం

సిద్దిపేటఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాలలో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులకు గాను అతిథి అధ్యాపకుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. హిస్టరీలో–2, పొలిటికల్ సైన్స్‌లో–2, జువాలజీ, ఫిషరీష్, ఫిజిక్స్‌లో ఒక్కో పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. సంబంధిత సబ్జెక్ట్ పీజీలో 55శాతంతో ఉత్తీర్ణత కలిగి ఉండాలని పేర్కొన్నారు. నెట్, సెట్, పీహెచ్‌డీ, అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. అర్హత, ఆసక్తి కలిగి ఉన్న అభ్యర్థులు వారి బయోడేటాతో పాటు సర్టిఫికెట్లు, 2 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో కూడిన దరఖాస్తు ఫారాలను ఈ నెల 9లోగా కళాశాల కార్యాలయంలో అందించాలని సూచించారు. 10న ఉదయం 11 గంటల నుంచి ఎంపిక కార్యక్రమం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

మహిళా చైతన్యానికి పూలే కృషి అమోఘం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి

కొండపాక(గజ్వేల్): మహిళా చైతన్యం కోసం సావిత్రీబాయి పూలే చేసిన కృషి అమోఘమని ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి కొనియాడారు. మండల పరిధిలోని ఖమ్మంపల్లి హైస్కూల్లో ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో సావిత్రీబాయి పూలే జయంతిని పురస్కరించుకొని నిర్వహించిన వ్యాసరచన, ఉపాన్యాస పోటీల్లో గెలుపొందిన విజేతలకు గురువారం ఎంఈఓ చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. భారతదేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు పూలే అన్నారు. పూలే గొప్ప సంఘసంస్కర్త, కవిగా పనిచేశారన్నారు. మహిళలు పూలేను ఆదర్శంగా తీసుకుంటూ ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో పీడీయస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి విద్యానాథ్, ఉపాధ్యాయురాలు జ్యోతి, నాయకులు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నాస్తికుడు నరేశ్‌పై చర్యలు తీసుకోవాలి

సిద్దిపేటకమాన్: అయ్యప్ప స్వామిని కించపరిచేలా మాట్లాడిన బైరి నరేశ్‌పై, సరస్వతి అమ్మవారిని అవమాన పరిచిన రెంజర్ల రాజేశ్‌పై పీడీయాక్ట్ నమోదు చేయడంతో పాటు కఠినంగా శిక్షించాలని సిద్దిపేట బ్రాహ్మణ సమాజం నాయకులు శ్రీకాంత్‌శర్మ డిమాండ్ చేశారు. హిందూ దేవతలపై నరేశ్, రాజేశ్‌లు చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ సిద్దిపేటలో బ్రాహ్మణ సమాజం నాయకులు, దేవాలయాల అర్చకులు గురువారం ర్యాలీ నిర్వహించారు. పట్టణంలో ర్యాలీ నిర్వహించిన అనంతరం చర్యలు తీసుకోవాలని సిద్దిపేట వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నాస్తిక సమాజం పేరుతో కేవలం హిందూ దేవతలను కించపరచడమే పనిగా పెట్టుకొని కొన్ని సంఘాలు పనిచేస్తున్నాయని మండిపడ్డారు. హిందూ దేవుళ్లను కించపరుస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఆర్టీసీలో ప్రయాణం సురక్షితం

గజ్వేల్‌రూరల్: ఆర్టీసీ బస్సులలో ప్రయాణించి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి పేర్కొన్నారు. పట్టణంలోని బస్టాండ్ ఆవరణలో గురువారం ఆర్టీసీ బస్సుల ద్వారా అందిస్తున్న సేవలపై ఆర్టీసీ ప్రచార రథానికి చెందిన కళాకారులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాజమౌళి మాట్లాడుతూ.. ప్రతినిత్యం వేలాది మంది ఆర్టీసీ బస్సుల్లో రాకపోకలు సాగిస్తున్నారని గుర్తుచేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మల్లేశం, కౌన్సిలర్ గోపాల్‌రెడ్డి, జీపీపీ డిపో మేనేజర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు పరామర్శ

సిద్దిపేటజోన్: పట్టణంలోని మెదక్ రోడ్డులో గురువారం తెల్లవారుజామున ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం జరిగి ఆహుతి అయిన వీధి వ్యాపారుల దుకాణాలను మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు పరిశీలించారు. ఈ సందర్భంగా బాధితులను పరామర్శించి, ప్రమాద సంఘటన కారణాలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర మంత్రి హరీశ్‌రావు దృష్టికి తీసుకెళ్లి బాధితులకు తగిన సహాయం అందేలా చూస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఆయన వెంట మున్సిపల్ కౌన్సిలర్లు వజీర్, లక్ష్మణ్, తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయుల కృషి ఎంతో గొప్పది

టీఎల్‌ఎం మేళాలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, అధికారులు, ప్రజాప్రతినిధులు



చేర్యాల(సిద్దిపేట): బహుమతులు గెలుచుకున్న ఉపాధ్యాయులతో ఎమ్మెల్యే ముత్తిరెడ్డి



గజ్వేల్‌లో ప్రదర్శనలను తిలకిస్తున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి



దుబ్బాక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎగ్జిబిట్స్‌ను తిలకిస్తున్న ఎమ్మెల్యే రఘునందన్‌రావు



దుబ్బాక: ఎగ్జిబిట్స్‌ను పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



కొండపాక(గజ్వేల్): ఎగ్జిబిట్స్‌ను తిలకిస్తున్న ప్రజాప్రతినిధులు

చేర్యాల(సిద్దిపేట): తరగతి గదిలోని ప్రతీ విద్యార్థికి పాఠం అర్థమయ్యేలా బోధించేందుకు ఉపాధ్యాయులు చేసే కృషి ఎంతో గొప్పదని జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. గురువారం స్థానిక పెద్దమ్మగడ్డ బాలుర పాఠశాలలో నిర్వహించిన టీఎల్‌ఎం ముగింపు కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపరాణి, ఎంపీపీ ఉల్లంపల్లి కరుణాకర్, వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి, కౌన్సిలర్ మంగోలు చంటితో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు విభాగాల్లో విద్యార్థులకు సులభతరంగా అర్థమయ్యే బోధన అభ్యర్థనా సామగ్రి మేళాలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు తయారుచేసి ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను ఆయన పరిశీలించారు. మేళాలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఉపాధ్యాయులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ మొగుళ్ల నర్సింహ్మారెడ్డి, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ముస్త్యాల బాల్‌నర్సయ్య, నాయకులు యాట యాదగిరి, శివగారి అంజయ్య, పచ్చిమడ్ల సాయికిరణ్‌గౌడ్, మండల పరిధిలోని పలు పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయాలి

దుబ్బాకటౌన్: విద్యార్థుల్లో అంతర్గతంగా దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీస్తేనే భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్‌రావు అన్నారు. గురువారం దుబ్బాక పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి బోధనాభ్యాసన మేళాను మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనితాభూంరెడ్డి, ఎంపీపీ కొత్త పుష్పలత కిషన్‌రెడ్డి, జెడ్పీటీసీ కడతల రవీందర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంఈఓ ప్రభుదాస్, కౌన్సిలర్లు, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

విద్యావ్యవస్థలో సమూల మార్పులు

తొగుట(దుబ్బాక): విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకురావడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని మండల విద్యాధికారి సత్తు యాదవరెడ్డి అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో బోధనాభ్యాసన సామగ్రి మేళాను గురువారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో తొగుట సర్పంచ్ కొండల్‌రెడ్డి, ఉపసర్పంచ్ బాల్‌రాజు, మాజీ ఎంపీటీసీ రమేశ్, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఎంతో ప్రయోజనం

దుబ్బాక: ఉపాధ్యాయులు తరగతి గదిలో టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్‌ను ఉపయోగిస్తూ పాఠ్యాంశాలు బోధించడం ద్వారా విద్యార్థులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని జిల్లా సెక్టోరియల్ అధికారి భాస్కర్, రాయపోల్ ఎంపీపీ అనిత శ్రీనివాస్ అన్నారు. గురువారం రాయపోల్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి టీఎల్‌ఎం మేళా నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ లింగాయపల్లి యాదగిరి, ఎంఈఓ నర్సవ్వ తదితరులున్నారు.

కొండపాక(గజ్వేల్): ప్రాథమిక విద్య బలోపేతం కోసం ప్రభుత్వం తొలిమెట్టు కార్యక్రమాన్ని చేపట్టిందని డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో బోధనాభ్యాస సామగ్రి కృత్య మేళాను ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. మేళా ప్రాంగణానికి రిటైర్డు లెక్చరర్ కీర్తి శేషులు పేర్ల వీరేశం పేరును నామకరణం చేశారు. ఉపాధ్యాయులను ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి అభినందించారు. కార్యక్రమంలో ఎంపీపీ సుగుణ, ఎన్‌ఆర్ ఈజీఎస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు కోల సద్గుణ, సర్పంచ్‌ల ఫోరం జిల్లా అధ్యక్షుడు ఆరెపల్లి మహాదేవ్‌గౌడ్, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షురాలు మాధురీరెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు సాయిబాబ, ఎంపీడీఓ రాంరెడ్డి, ఎంపీటీసీలు అనుసూయ, ఆరుట్ల లక్ష్మి, ఉపాధ్యాయులు, నాయకులు పాల్గొన్నారు.

గజ్వేల్‌రూరల్: విద్యాశాఖ ఆధ్వర్యంలో గజ్వేల్ పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన మండల స్థాయి టీఎల్‌ఎం మేళాను ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డిలు గురువారం తిలకించారు. ఈ సందర్భంగా జరిగిన 47 పాఠశాలలకు చెందిన 150 మంది ఉపాధ్యాయులు తాము రూపొందించిన ఎగ్జిబిట్స్‌ను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డిలతో పాటు మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, ఎంపీపీ దాసరి అమరావతి, జెడ్పీటీసీ మల్లేశంలకు ఎగ్జిబిట్స్‌ల వివరాలను ఉపాధ్యాయులు తెలియజేశారు. కార్యక్రమంలో ఎంఈవో సునీత, సెక్టోరియల్ అధికారి భాస్కర్‌తో పాటు కౌన్సిలర్లు, ఆయా పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.